
# కొండంత పత్రి

ఏ కొంపెకిష్టరెయ్యో కోకలెత్తుకు పారిపోతే వచ్చనాకుల చాటున ఒళ్ళు కనబడకుండా నక్కి కూచున్నట్లుగా ఉంది భూదేవి. కందెనలో కుంచె ముంచి జర్రున చార గీచినట్టు పచ్చని ప్రకృతి నడుమ పొడుగ్గా తారురోడ్డు. వెండి జరీపోగుల్లా తళతళలాడుతూ రోడ్డు పక్కనే రైలుపట్టాలు. రైలుమార్గం పక్కనే బలహీన వర్గాలవారికోసం ప్రభుత్వం కట్టించిన ఇళ్ళ కాలనీ.

పొద్దు నాలుగు బారలు పైకెక్కిందేమో. పిట్టలు ఖాళీచేసిన చెట్టులా సడీ చప్పుడూ లేకుండా ఉంది వాడ. పొద్దుపోయినప్పుడూ, పొద్దు మొలిచినప్పుడూ మాత్రమే అక్కడ సందడీ, సంచారమూ. తెల్లవారి ఎండ కత్తులు సానబెట్టుకునే లోపున ఇళ్ళొదిలి కూలీనాలీకి వెళ్ళిపోతారందరూ. ఇంకా రెక్కలు రాని పసికూనలూ, రెక్కలుడిగిపోయిన ముదివగ్గులూ మాత్రమే గూళ్ళలో మిగిలిపోతారు.



**తన కడుపే కైలాసం అనుకొనే కన్నకొడుకు నైజం తెలిసి, మనవడి ముచ్చటకోసం తన ఆనందాన్ని సైతం త్యాగంచేసిన అవ్వ కథ.**

సుమారు ఏభై కుటుంబాలవాళ్ళున్న కాలనీలో నెలకొన్న ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఒక్క తగీరు మొగిలయ్య కుటుంబంలో మాత్రమే అలికిడీ, అల్లరీ - పొదరింట్లో కేరింతలాడే కముజు పిట్టల కూతల్లా.

ఊరి నట్టనడుమ ఆకాశమంత పెద్ద వేపచెట్టు. దానికింద మాతమ్మ గుడి. గుడి ఎదురుగా ఇప్పుడో రేపో చతికిలబడిపోతుందేమోనన్నట్లున్న ఓ పాత చుట్టు గుడిసె. వైధవ్యంతోబాటు తెల్లబడ్డ జుత్తుతో, కొద్దిగా గూనుపోయిన వీపుతో, డొక్కుబారిపోయిన శరీరంతో సన్నగా, పొట్టిగా ఉండే అరవై ఏళ్ళ జియ్యమ్మ గుడిసె వాకిట్లో గువ్వలా కూచుని ఉంది, తనలో తానే గొణుక్కుంటూ, చేతులు తిప్పుకుంటూ, బుగ్గలు నొక్కుకుంటూ. నిన్నటి నుంచీ వక్కకూ, ఆకుకూ నోచుకోని ఆవిడ బోసినోరు వాటికోసం జివజివలాడిపోతోంది.

మొగిలయ్య బిడ్డలు నలుగురిలోనూ పెద్దవాడు పదో క్లాసు చదువుకుంటున్న వినాయకుడు కట్ డ్రాయర్‌లో నిగనిగలాడిపోతూ బోరింగు దగ్గర రెండు మూడు జతల ఎన్.సి.సి బట్టలు ఉతుక్కుంటున్నాడు ఏకాగ్రచిత్తంతో.

ఒకటి రెండు నెలల్లోనే సమర్తాడేలా ఉన్న శ్రీదేవి తన ఒంటిమీది రైకా పావడాల చిరుగులకేసి చూసుకోకుండా, పాలసముద్రం తీగల పెరడు పక్కన గుంజకు కట్టేసిన తన రెండు మేకపిల్లల నడుమ కూచుని అవే తన చెలికత్తెలన్నంత ప్రేమగా వాటి ఒళ్ళు నిమురుతోంది, హీరోయిన్‌లా.

రైలుపట్టాలకు అవతల స్కూల్లో సెకండ్ బెల్ మోగుతూంటే, చింపిరి తల దువ్వుకునే ధ్యాసా ఓపికా లేని ఏడేళ్ళ విజయశాంతి మురికినంచీ భుజానికి తగిలించుకుని పరుగుతీస్తూ, అడ్డంగా రైలు దూసుకురావడం గమనించి అక్కడే ఆగిపోయింది.

ఎవరింట్లో నుంచో రేడియోలో బిగ్గరగా వినిపిస్తోన్న సినిమా పాటకు అనుగుణంగా పరుగిడుతూన్న రైలువైపు తిరిగి చిందులు వేస్తున్నాడు - ఒంటి మీద నూలుపోగైనా లేని నాలుగేళ్ళ చిరంజీవి.

నలుగురు బిడ్డలతో తనివి తీరలేదేమో, మొగిలయ్య పెళ్ళాం చింతామణి మళ్ళీ కడుపుతో ఉందిప్పుడు. ఎనిమిదో నెల. తీరిగ్గా పళ్ళు తోముకొచ్చిన మొగిలయ్య లుంగీతో మొహం తుడుచుకుంటూ పెళ్ళాం వైపు చూసి "ఒసేయ్" అన్నాడు. "చింతామణీ!" అన్నాడు.

ఆ తరవాత ఏమన్నాడు?

"కడుపుతో ఉండావుగదా, పాపం. ఏమన్నా తింటివా లేదా?" అనలేదు.

"పిలకాయలు తిన్నారా?" అనలేదు.

"ముసిల్దానికేమన్నా పెట్టినావా?" అనలేదు.

"చద్దన్నం ఉంటే పెట్టమ్మే, టైమయిపోయింది" అన్నాడు.

"బిడ్డలకే సాల్లా! నన్ను తినేసి పో!" అంది చింతామణి.

లోహపు చిలుము అంటుకుని ఆహా ఓహో అంటున్న ఖాకీ పంట్లాం, ఖాకీ చొక్కా తొడుక్కుని, "కొల్లబోయిన సంసారం. థూ!" అంటూ ఇంట్లోంచి బయటి కొచ్చాడు మొగిలయ్య, మీసాలు మెలేసుకుంటూ.

దూరంగా బోరింగ్ దగ్గరున్న వినాయకుడు చెయ్యి పైకెత్తి, "ఓయ్యోవ్! మరిసిపోబాక. ఎల్లుండి తెల్లారి రైలుకే పోవాల నేను" అంటూ కేకేసి హెచ్చరించాడు.

"సరేలేరా."

గుడి ముందర నిలబడి, మాతమ్మకు దండం పెట్టుకుని ముందుకు కదిలాడు మొగిలయ్య.

"ఒరే అయ్యా మొగిలీ" అంటూ పిలిచింది, అక్కడే గుడిసె ముందర కూర్చున్న జియ్యమ్మ.

"ఏమ్మోవ్?" అంటూ వెనక్కి తిరిగి చూశాడు మొగిలి.

"ఒక పావలా ఇచ్చిపోరా!" దేవుణ్ణి వరమడుగుతున్నంత ఆశ ఆమె గొంతులో.

"ఎందుకే?"

"వక్కాకు లేకుండా నిన్నటేలనించీ మొకం వాచిపోతా ఉండాన్రా సామీ."


"సందేళ తెస్తాన్లేమ్మా" అనేసి ముందుకు కదిలాడు మొగిలి. రైలుకట్ట వెంబడే నడుస్తూ పేట వైపుగా సాగిపోయాడు.

"మానం ఈనం లేని జల్మ. ఇంట్లో పెండ్లానికి కడుపు నిండా బిడ్డను బెట్టి, ఓటలుకు బోయి కడుపు నిండా తింటాడు. ముసిలికట్టె వొక్కాకు గావాలంటే పావలా దొరకదుగానీ, వీడు సారాయి తాగని దినం మాత్రం లేదు. ఆ పదైదు నూర్లు జీతమూ వీడి జల్సాలకే సరిపాయె. పెండ్లాం బిడ్డలు బతికేదేముందింక? ఎదవ - ఎదవ! ఓగెదవ! సంగనాచెదవ!" అంటూ తిట్టిపోసింది జియ్యమ్మ.

చిత్రాలు: పి.ఎస్. బాబు

ఆ ఈసడింపు విన్న చిరంజీవి వెనకాలే వచ్చి "ఎదవంటావా మా అయ్యను?" అంటూ తన లేతకాలితో ఆమె వీపు మీద ఒక్క తన్ను తన్నాడు.

"ఓర్నా బట్టా..." అంటూ మూలిగిందామె. నొప్పి సంబాళించుకుని,



"నీ ముక్కు కోసేస్తా ఉండు" అని గదమాయించింది.

ముక్కు మూసుకుని పకపకా నవ్వుతూ పరుగు తీశాడు వాడు.

ఆ పూట గిన్నెడు కూటినీళ్ళయినా దక్కుతుందన్న ఆశ కనిపించలేదామెకు. ఇక కాలహరణం చెయ్యడం బాగుండదనిపించింది. ఒంట్లో పనీ పాటు చేసే సత్తువ లేకపోయినా, తన ఆలోచనను అమలులో పెట్టాలన్న కృతనిశ్చయంతో పైకి లేచింది. గుడిసెలోకి వెళ్ళింది. ఇదివరకే సేకరించి పెట్టుకున్న రెండు చిరుగుల గోతాలను చుట్టి చేతికెత్తుకుంది. బయటికొచ్చి తలుపు మూసింది.

ఉతికిన బట్టల్ని బలంగా పిండి ఆరుబయట కమ్మీ మీద మూగి ఎండలో ఆరవేస్తున్నాడు వినాయకుడు.

"అబ్బా, యినాయకా!"

"ఏంవ్వా!"


"గుట్టదాకా పోయొద్దాం రారా బుజ్జీ."

"ఎందుకూ?" అంటూ కసురుకున్నాడు వినాయకుడు.

"మామిడికాయలూ, గరికా నేను కోసుకుంటా. మారేడాకులూ, నాలుగు

ఎలక్కాయలూ కోసిద్దువనీ.''
''నాకు తీరుబాటులేదు.''
''నా సామి, నా బంగారుకొండ.''
''పోమే. ఎన్ని వన్లుండాయి నాకు? ఇస్కూలుకు పోకుండా లీవు పెట్టింది ఎందుకనుకుంటివి? నీ ఎనకాల తిరిగేదానికా?'' అన్నాడు వినాయకుడు విసుగ్గా.
''ఓమ్మే బిడ్డా! నువ్వన్నా రాయే నాతో'' అని శ్రీదేవిని బతిమాలిందామె.
''నాకు వనుందవ్వా. కావాలంటే మద్యానమొస్తా. మేకల్ని తోలుకొని.''
''ఏం బిడ్లురా!'' అంటూ ఊడిపోయిన జుట్టు ముడేసుకుంది జియ్యమ్మ. ''నరే, నువ్వు మద్యానమే రా తల్లీ. వొచ్చేటప్పుడు దోటి మరిచిపోబాక'' అంటూ గుట్టలవైపుగా దారితీసింది.

తగీరు జియ్యమ్మ కొడుకు మొగిలయ్య రైల్వే గ్యాంగ్‌మేన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రాజాలా నెల నెలా గవర్నమెంటు జీతం పుచ్చుకుంటున్నాడన్న పేరేగానీ, అతడి పిల్లలకు చదువుసంధ్యల్లేవు. నరైన తిండీ బట్టా లేవు. ఇంట్లో వనులెవరు చేస్తారంటూ ఎలిమెంటరీ స్కూల్లో చేర్పించిన ఏడాదికే శ్రీదేవిని చదువు మాన్పించేశాడు. ఆ పిల్లకు పెళ్ళయిపోయి ఇంట్లో ఆ స్థానానికి ఖాళీ ఏర్పడేవరకు విజయశాంతి బడి మానుకునే ప్రసక్తి రాదు. చిరంజీవి చదువుకుంటాడో లేదోగానీ, వినాయకుడు వదో తరగతి వరకు రాగలిగాడంటే అదెంతో గొప్ప. వాడు ఏడో తరగతిలో వరీక్ష తప్పినప్పుడు ''ఏం నదువురా నీ నదువు? కూలికి పోతే దినమ్మో వదో వన్నెండో వొస్తుంది గదా'' అంటూ అడ్డుకట్ట వేశాడు మొగిలయ్య. అయితే, వాడు వినలేదు. మళ్ళీ వరీక్షకు కట్టి ప్యాసై పై తరగతికెళ్ళాడు. పేటలో వెల్‌ఫేర్ హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాడు కనక, గట్టిగా ఏమీ అనలేకపోయాడు మొగిలయ్య.



''వక్కాకు లేకుండా నిన్నటేలనించీ మొకం వాచిపోతా ఉండాన్రా సామీ'' అన్నది తల్లి జియ్యమ్మ.

కొడుకుతో, కోడలితోబాటుగా పాత గుడిసెలో ఉండేది జియ్యమ్మ పూర్వం. నాలుగేళ్ళ కిందట గృహనిర్మాణ పథకం వచ్చినప్పుడు గవర్నమెంటు నౌకరీలో ఉన్న తనకు ఇల్లు ఇవ్వరని తెలిసి, జియ్యమ్మను వేరేగా ఉంచాడు మొగిలయ్య. జియ్యమ్మ ఏకాకితనమే ఆమెకు అర్హతగా మారి, అది అతడికి వరమైంది. ప్రభుత్వం ఆమెకొక ఇల్లిచ్చింది. పథకం పూర్తయిన తరవాత జియ్యమ్మ కొడుకు ఆలుబిడ్డలతో ఆ ఇంట్లో ప్రవేశించాడు. గుడిసెలో జియ్యమ్మ మిగిలింది.

కోడలు అంత పెడితే తింటుంది. లేకపోతే లేదు. కూలీ నాలీ చేసుకునే వయసు కాదు. ఒంట్లో శక్తి లేదు. నీరసం. ఆవిడకున్న ఒకే ఒక్క అలవాటు ఆకూ వక్కా వేసుకోవడం. ఆ వైభోగానికి కూడా అప్పుడప్పుడూ కరవే. ''ఇందామ్మా! ఈ దుడ్లు నీకు. ఆకూ వక్కా కొనుక్కో. అయిపోతే మళ్లీ అడుగు'' అని నోరారా అనే కొడుకునివ్వలేదు మాతమ్మతల్లి.

చెరువుకట్ట ఎక్కబోతుంటే, పైటచెంగులో ఏదో పొదివి వట్టుకుని ఊతకర్రతో ఎదురువడింది మంగమ్మ.
''ఏందక్కా కొంగులో?'' అని అడిగింది జియ్యమ్మ.
''కట్టకింద కుంటలో పొన్నగంటాకు ఉంటే కోసుకుంటి. ఔనుగానీ, ఇట్ట యాడికి నువ్వు?''
''వొక్కాకు కోసరం వొచ్చింది తిప్పలు నాకు'' అంటూ నిట్టూర్చింది జియ్యమ్మ. ''కాసింత ఆకూ వొక్క పేడొకటీ ఉంటే ఇచ్చిపో అక్కా.''
''అయ్యో నా రాత. నేనే నిన్నడగదామనుకుంటినిగదే జియ్యా.''

నాలుగడుగులు ముందుకు వేసి 'నా దగ్గిరుంటే అడిగి తీసుకునేవాళ్ళే అందరూ. నా కిచ్చే ముండ ఈ బూలోకంలో ఒక్కతీ లేదు' అనుకుంది జియ్యమ్మ నిరసనగా.

కట్టమీద నడుస్తోంటే ఎక్కడ తూలి చెరువులో వడిపోతానో అని భయం వేసింది ఆమెకు. చెరువులోకి నీళ్ళొచ్చాయి. నీళ్ళ మీది నుంచి వీచే గుడ్డిగాలులు ముసిల్దానితో సైతం నరసాలకు దిగాయి. కట్ట దిగువ వచ్చటి పొలాలు, చెరకుతోటలు. వాటికవతల మైలు దూరాన కనిపిస్తున్న పేటలోని మిద్దెలు, మేడలు. కట్టకు రెండో చివర గుట్ట దిగువ గుబురుగా మామిడితోటలు, వాటి కంచెల్లో ఎత్తైన చెట్లు. గుట్టల మీద నందులేకుండా వరుచుకున్న వచ్చిక తివాచీలు. వానల్లో తడిసి నీళ్ళోసుకున్న భూదేవి తీగలో నుంచి అప్పుడే తుంచిన వచ్చి తమలపాకులా వచ్చగా కనిపిస్తోంది జియ్యమ్మకు.

కాలు జారకుండా కుదురుగా నడుస్తూ, ఏటవాలుగా ఉన్న దారి వెంబడి కట్ట దిగిందామె. గుట్టల అంచుల పొడుగునా మామిడి తోటలూ, ఒళ్ళంతా పూతలెత్తిన వేరుసెనగ చేలూ వచ్చగా వరుచుకున్నాయి. మామిడి కాయల కాలం ఎప్పుడో పోయింది కాబట్టి, తోటలకిప్పుడు కంచెలూ లేవు, కాపుదలా లేదు.

చుట్టూ చూస్తూ ఓ తోటలోకి దూరింది జియ్యమ్మ. ఇతరుల దృష్టిలో వడకుండా నక్కుతూ నడయాడుతూ అందిన కొమ్మల్లో నుంచి చప్పుడుగాకుండా మామిడాకులు తుంచి గోతంలో కుక్కుకోవడం మొదలెట్టింది.

రోగమొచ్చిన కోడిలా కన్ను మూస్తూ తెరుస్తూ తూగుతోంది ఎండ. తిండివేళకు ఓ గోతం నిండా మామిడాకులు కూరేసి, ఓ పొదరింట్లో దాచేసి ఉసూరుమంటూ అలసటగా ఓ బండమీద కూచుంది జియ్యమ్మ. ఆకలికి ఒళ్ళు తూలిపోతోంది. చెయ్యాల్సిన వని ఇంకా చాలా ఉంది. నేరేడాకులు, మారేడాకులు, సీతాఫలం రెమ్మలు, నేలతంగేడు, మానుతంగేడు, జిల్లేడు పూలు, వనిలో వనిగా వెలక్కాయలు, రాగికంకులు - ఇదంతా తెమిలేదెప్పుడు? దోటి తెస్తానన్న శ్రీదేవి ఇంకా రాదేం?

రానే వచ్చింది శ్రీదేవి ''అవ్వా! ఓ...వ్వే! ఎక్కడుండావే'' అని ఎలుగెత్తి కేకపెడుతూ.
''ఈడుండానమ్మోయ్, ఈ దొనకాడ'' అని వణకుతున్న గొంతుతో బిగ్గరగా బదులిచ్చింది జియ్యమ్మ.

నత్తుగిన్నెలో తెచ్చిన నంగటీ వుల్లగూరా మునలామె కందించి, మేకపిల్లల్ని మేతకోసం గుండ్ల మీదికి తోలింది శ్రీదేవి.
''నా తల్లి. నా ఆయుస్సు గూడా పోసుకుని నూరేండ్లు బతుకు.''
దొనలో నీళ్ళు తాగి నోరు తుడుచుకుంటున్న నాయనమ్మను అడిగింది శ్రీదేవి- ''ఈ ఆకులంతా అమ్మితే ఎన్ని రూపాయలొస్తుందవ్వా?''
''ఎంతో ఒకంత. నాకు వది దినాలు ఆకూ వక్కా, నీకు రెండు రిబ్బన్లూ వొస్తే సాలదా?'' అంది జియ్యమ్మ.
ఓ క్షణం ఆగి, ''మీ తాత బతికుంటే నాకీ అగచాట్లుండేవా?'' అని నిట్టూర్చింది. ఆ మాట అన్నాక ఆమె కంట్లో నీళ్ళు నిలిచాయి. ''మహన్నబావుడు. నంపాయించిన పెతి రూకా తెచ్చి నాసేత బెట్టేవోడు. వారం వారం నంతకు బోయి కవిలి ఆకులూ, చారెడు పేళ్ళూ తెచ్చి నా మొగాన కొట్టేవోడు. నచ్చి ఏ లోకానుండాడో మా రాజు...'' అంటూ చేతులు మోడ్చింది.

అవ్వా మనవరాలూ ఇద్దరూ కబుర్లాడుకుంటూ కార్యరంగంలోకి దిగారు.
''మీ యమ్మ కడుపునిండా తినిందా లేదా? నోటికాడ కూడు గూడా లటుక్కున పెరుక్కుంటారు ముండబిడ్లు.''
''తినిందవ్వో. తినేసి వండుకునేసింది.''

''ఆదొక ఎనవగొడ్డు. తిట్టినా ఉలికివడదు. తన్నినా ఉలికివడదు. నోట్లో నాలికే లేదు. దాని ఓపికను మెచ్చుకోవాల్నే తల్లీ. అడుపాదడుపా కూలీ నాలీకి పోతా ఉండె, పాపం బిడ్డ. ఆ బాగ్గెం కూడా లేకుండా కడుపుజేసి ఇంట్లో కుదేసినాడు ముదనష్టపోడు. అది పురుడు పోసుకొని బిడ్డ దోగాడేదాకా దాని మంచీ సెడ్డా నువ్వే జూసుకోవాలమ్మో'' చిరునవ్వు నవ్వింది శ్రీదేవి.

''ఇట్లాంటి వరిగిలి ఎదవలకు పెండ్లాం బిడ్డలు ఏలనో? నా సిన్నతనంలో అచ్చేసిన ఆంబోతొకటి తిరగతా ఉండేది. అదీ వీడూ - రెండూ ఒకటే. గవురుమెంటోళ్ళు కట్టించిన ఆ ఇల్లు, ఆ ఇంట్లో ఆ బియ్యం కార్డు, మీ అన్నకు కూడుబెట్టే ఆ అస్టలూ లేకపోతే ఈ నంసారం ఏం గెతి?''
''అవ్వా, అమ్మకు పురుడెప్పుడొస్తుంది?''
''ఇంకా ఒక నెల పోవాల్లే - నోముల వండగొచ్చేస్తుంది.''

"అయ్యే చెప్తా ఉండె అమ్మతో. ఈసారి మొగబిడ్డ పుడితే సల్మాన్ ఖాన్ అనీ, ఆడబిడ్డ పుడితే దివ్యభారతి అనీ పేరు పెట్టాలంట" అంటూ నవ్వింది శ్రీదేవి.

"అవేం పేర్లే?"

"సిలిమావోళ్ళు."

"ఒరి వీడి బడాయి కాలిపోనూ. మింగ మెతుకు లేదు మీసాలకు సంపంగి నూనె. ఇంట్లో దరిద్రం కనబళ్ళా వీడికి. ఇందర్లోకంలో ఉండాడు. పెండ్లానికి ముక్కుపుల్లయినా లేదు, పుట్టిన బిడ్డలకందరికీ సిలిమా పేర్లొకటి - ఎట్టనో మీ అన్న తప్పించుకుండె. పిళ్ళారి పండుగ నాడు పుట్టినాడు వాడు. అప్పుడు మీ తాత బతికుండె. 'నా మనవడి పేరు యినాయకుడు' అనె. నోరు మెదపలా మీ అయ్య. ఒసేయ్ సిరిదేవీ. ఆ సిలిమా పేర్లు అట్ల కాలిపోనీ, రేపు నీకు పెండ్లయి ఒక బిడ్డ పుడితే లచ్చనంగా మీ తాత పేరు పెట్టుకో."

"తాత పేరా? పొట్టబ్బగదా? ఆ పేరా!"

పొద్దు గూకేసరికి రెండు గోతాలూ నిండిపోయాయి. కడగొట్టుసారిగా రెడ్డోళ్ళ తోపు కంచెలో ఉన్న వెలగచెట్లో నుంచి దోటి సాయంతో దబదబా ఓ ఇరవై కాయలు కోసుకుంటున్న తరుణంలో వచ్చి పడింది అవాంతరం.

చెరువుకట్ట దిగుతున్నాడు రెడ్డి. అతడి పక్కన పాలేరు కాళాస్త్రి. అక్కణ్ణించి చూశాడు కాళాస్త్రి. "హేయ్, ఎవురాడ ఎలక్కాయలు కోస్తా ఉండేది?" అంటూ సుడిగాలిలా లగెత్తుకొచ్చాడు. గుండె గుభిల్లుమనింది జియ్యమ్మకు.

"అయ్యో అయ్యో! ఇన్ని కాయలా? చెట్టే కూల్చేసినారుగదే ముండలారా!" అంటూ చిందులు తొక్కుతూ శ్రీదేవి చేతిలోని దోటి లాక్కున్నాడు కాళాస్త్రి.

"య్యోవ్! ఎవుర్ని ముండలంటా ఉండావ్?" అంటూ గుర్రుగా చూసింది శ్రీదేవి.

"చేసింది సాలక మల్లా రోసం జాస్తా దీనికి ... ఏందే ఈ గోతాల్నిండా?" అంటూ రెండు గోతాలూ కుమ్మరించాడు.

ఇంతలో రెడ్డి అక్కడికొచ్చాడు "ఏందిరా కాళాస్త్రీ?" అంటూ.

"అనా! తోపంతా కుళ్ళబొడిసేసినారు. సూడన్నా ఈ మామిడాకులు మనవే. ఈ రాగెన్నులు మనవే. ఎన్ని ఎలక్కాయలో జూడు. అన్నీ కసిగందుకాయలు. చెట్టుక్కట్టేసి చెర్నాకోలుతో కొట్టాల" అంటూ వీరభద్రుడిలా చిందులు తొక్కాడు కాళాస్త్రి.

ఆవేశమంతా పాలేరు దగ్గర దాచేసి, జియ్యమ్మ వైపు చూశాడు రెడ్డి. చేతులు జోడించింది జియ్యమ్మ.

"పోనీ, ఇచ్చేయ్‌రా. ఇంకోసారి ఇట్ల రాబాకండి. వదరా" అంటూ ముందుకు నడిచాడు రెడ్డి. పోతూ పోతూ "ఎవరే జియ్యమ్మా ఆ బిడ్డ? మొగిలిగాడి కూతురా?" అని అడిగాడు.

"ఔన్సామీ."

ఒంట్లో కండలున్నప్పుడు రెడ్డోళ్ళింట్లో చాకిరీ చేసింది జియ్యమ్మ. ఆ అభిమానం ఎంతో కొంత ఉన్నందువల్ల తప్పు మన్నించాడు రెడ్డి.

పాలేరు వీరంగమంతా వొట్టి బీరాలుగా తేలిపోయినందుకు శ్రీదేవి ముఖం సంతోషంతో విచ్చుకుంది.

"అంత తిమురెందుకవ్వా ఆ కాళాస్త్రికి?"

"అంటే అన్నాడుపో. గొప్పోళ్ళకు గొప్ప బుద్ధి, చిన్నోళ్ళకు చిన్న బుద్ధి. పదమ్మా, పోదామింక."

చెరో గోతం మూట నెత్తిన పెట్టుకుని, మేకపిల్లల్ని తోలుకుని చెరువుకట్ట మీదగా నడిచి ఇల్లు చేరుకున్నారిద్దరూ. మూటల్ని గుడిసెలో భద్రపరచింది జియ్యమ్మ.

చీకటి ముసురుకుంటుంటే, కాకులన్నీ కావు కావుమంటూ గుడి వేపచెట్టు మీదికి చేరుకున్నాయి. పేదవాడి పొయ్యిలోంచి పొగలు లేస్తున్నాయి, శ్రామిక గీతావళిలా భువనమోహనంగా, హృదయస్పందనంగా.

వీధుల్లో కోలాహలం. జనమంతా వాడలోనే ఉన్నారు. వీధి దీపాల కింద మూగి, పాటలు పాడుకుంటున్నారు. ఆటలాడుకుంటున్నారు. కబుర్లు చెప్పుకుంటున్నారు.

బట్టలు సరిగ్గా ఆరలేదని విసుగుతో ఉసూరుమంటున్నాడు వినాయకుడు. ఇంటికొచ్చిన తండ్రిని "అయ్యా, తెస్తివా?" అని అడిగాడు.

"తొందరేలరా. రేపు రాత్రికిగదా నీకు" అన్నాడు మొగిలయ్య.

"నాయనా యినాయకా! పేట కెంతబ్బా బస్చార్జీ?" అని అడిగింది జియ్యమ్మ.

"ఒకటిన్నర్రూపాయ్."

"ఆకూ వక్కా తెస్తానంటివి గదరా కొడకా?"

"రేపు తెస్తాలేమ్మా."

"గోడ మింద రాసిపెట్టిన మాటే గదా."

"ఏందీ?" అంటూ ఉడుక్కున్నాడు మొగిలి.

రూపాయిన్నర ఎవర్నడిగేది? ఎక్కడ దొరుకుతుంది? రెండు మూటలూ బస్సులో వేసుకోనిస్తాడా కండక్టరు? ఎంత శ్రమ! సుబ్రమణ్యం ఇంటికి వెళ్ళింది జియ్యమ్మ. వాడి కొడుకులిద్దరూ ఇంటి ముందర రిక్షాతో ఆడుకుంటున్నారు.

"ఏమత్తా?" అన్నాడు సుబ్రమణ్యం.

"ఒరే మణీ - పొద్దున పేటకు పోతా ఉండావా లేదా రిక్షాతో?"

"పోకపోతే జరుగుతుందా... ఏం సంగతి?"

"నేనొస్తాన్రా రిక్షాలో."

"సర్లే."

"మామిడాకుల గోతాలు రెండుండాయిరా నాయనా."

"అమ్మోవ్! పెద్ద పనే పెడితివే. ఊరికే కుదర్దు. ఐదు రూపాయలిస్తావా?"

"ఇస్తాన్లేరా."

ఇంటికెళ్ళి హాయిగా పడుకుంది జియ్యమ్మ.

తెల్లారగానే రిక్షా తెచ్చి ఇంటి ముందర నిలబెట్టాడు సుబ్రమణ్యం. రెండు మూటలూ తానే ఎత్తి రిక్షాలో వేశాడు. జియ్యమ్మను ఎక్కి కూచోమన్నాడు. రిక్షా కదిలింది.

ఆకాశం ముసురు పట్టింది. విజయశాంతికి ఎప్పుడైనా పౌడర్ దొరికితే ముఖమంతా పులుముకునేటంత అబగా ఆకాశం బూడిద పూసుకుంది.

పడుచుకుర్రాళ్ళంతా కలిసి మాతమ్మ గుడి ముందర కర్రలు పాతి పచ్చి టెంకాయమట్టలతో పందిరి వేస్తున్నారు. బంకమన్ను తెచ్చి వినాయకుణ్ణి తీరుస్తున్నారు.

పది నిమిషాల్లో పేటకు చేరుకుంది రిక్షా. రెండు ఫర్లాంగులు పొడుగున్న మెయిన్ బజారు రంగులు కొలువుదీరినట్లు అందంగా ఉంది. రోడ్డు నిండా జనం - వచ్చేపోయే బస్సులు దారి దొరక్క, మెల్లగా నడుస్తున్నాయి. పల్లెటూళ్ళ జనాలు పొలోమంటూ వచ్చి రోడ్డుకు ఇరువైపులా బారులు తీరి రకరకాల అంగళ్ళు పెట్టేశారు. పచ్చి బంకమట్టితో సైజులవారీగా వినాయకుడి బొమ్మలు, పువ్వులు, పత్రి, తులసి మాలలు, చెరకుగడలు, అరిటాకులు, మొగలిరేకులు, చమ్కీ అద్దిన రంగు కాగితాల గొడుగులు, చీనీ, జామ, వెలగ, బేరికాయలు, అరటిపళ్ళు, టెంకాయలు ... ఒకటా, రెండా? లెక్కలేనన్ని. సందు లేకుండా రోడ్డు నిండా ఇవే అంగళ్ళు. కళ్ళు చెదిరిపోతున్నాయి.

రోడ్డువార కొంచెం జాగా చూసుకుని మూటలు దించాడు సుబ్రమణ్యం.

"ఇంక నన్ను పొమ్మంటావా అత్తా?"

"పో."

"అయితే, దుడ్లియ్యవా ?"

"మల్లొచ్చి ఇస్తాపోరా నాయనా."

సుబ్రమణ్యం వెళ్ళిపోయాడు. పత్రి ఏ బేరానికి అమ్ముతున్నారో గమనిస్తూ మూటల దగ్గర బితుకు బితుకుమంటూ నుంచుంది జియ్యమ్మ. సన్నగా తుంపర పడుతోంది. రోడ్డంతా బురద బురదగా ఉంది. ఇవేమీ లెక్కచెయ్యకుండా ఊరి జనమంతా వచ్చి పండక్కి కావల్సినవన్నీ కొనుక్కుపోతున్నారు. వాళ్ళలో పిల్లలే ఎక్కువ - ఊరేగుతున్న పువ్వుల్లా! లెక్కకు మిక్కుటంగా తిష్ఠ వేసిన అంగళ్ళ తీరు చూస్తుంటే, పిళ్ళారిబొమ్మలూ, పూజాద్రవ్యాలూ సగానికి సగం మిగిలిపోయేటట్లే ఉంది.

జియ్యమ్మకు ఓ ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన సుబ్రమణ్యం ఉన్నప్పుడే రానందుకు తన బుద్ధిమాంద్యాన్ని తిట్టుకుంది.

కట్టమీద నడుస్తోంటే ఎక్కడ తూలి చెరువులో పడిపోతానో అని భయంవేసింది ఆమెకు. చెరువులోకి నీళ్ళొచ్చాయి.



ఓ మూట ఎత్తి నెత్తిన పెట్టుకుని ఇళ్ళు రద్దీగా ఉండే ఓ వీధిలోకి వెళ్ళింది. అక్కడ ఓ ఇంటి ముందర ఉన్న పెద్ద అరుగు మీద మూట దించింది. మళ్ళీ బజారుకెళ్ళి రెండో మూట కూడా మోసుకొచ్చింది. ఆకులన్నీ అరుగు మీద కుమ్మరించింది. బిలబిలమంటూ వీధి జనం వచ్చి ముసురుకున్నారు. రూపాయి పుచ్చుకుని ఆకులు రకానికి రెండేసి రెమ్మలిచ్చింది జియ్యమ్మ. వెలక్కాయలు కావాలన్నవాళ్ళకు వాటిని అదనపు వెలకు అమ్మింది. ఒక్క గంటలో నగం సరకు అక్కడే అయిపోయింది.

కాసేపు సూకలు జల్లించినట్టు జలజలా రాలుతూ, కాసేపు ఆకాశంలో ఒదుక్కుంటూ, గోడమీది నుంచి కిందికీ, కిందినుంచి గోడమీదికీ మళ్ళీ మళ్ళీ గెంతే పిచ్చికలా తుర్రుబుర్రుమంటోంది వానతుంపర. మిగిలిన ఆకుల్ని మళ్ళీ గోతంలోకి తోసి మరో వీధిలోకి వెళ్ళింది జియ్యమ్మ. మరో గంటలో ఖాళీ సంచులు మాత్రం మిగిలాయి. డబ్బు కొంగున ముడేసుకుని బొడ్లో దోపుకుంది ఆమె.

మబ్బుల చాటున ప్రభ పోగొట్టుకున్న సూర్యుడు నడినెత్తిమీదికొచ్చాడు. బజారులో రెండు రూపాయలిచ్చి తమలపాకులూ, వక్కపేళ్ళూ కొనుక్కుంది జియ్యమ్మ. ఆకులో కొంచెం సున్నం అడిగి పెట్టించుకుంది. ఇంటికి బయలుదేరింది. పేట దాటుకున్నాక రోడ్డు పక్కన కూచుని రెండు వక్కపేళ్ళూ, రెండు ఆకులూ రాతితో నలగ్గొట్టి నోట్లో తురుము కుంది. వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్లైంది.

రైలువట్టాలు దాటుకుంటుంటే సుబ్రమణ్యం కనిపించాడు.

''ఒరే, ఇందా నీ అయిదు రూపాయలు'' అంది ఆమె కొంగుముడి విప్పుతూ.

"ఒద్దు పోయే. ఊరికే తమానకడిగినానంతే"

''ఒరే, సామీ. నీ కష్టం నాకేలరా? పిల్లా జెల్లా ఉన్నోడివి. తీసుకోరా నాయనా'' అంటూ బలవంతంగా ఇచ్చేసిందామె.

మాతమ్మ గుడి ముందర పందిట్లో సర్వాలంకార శోభితుడై కొలువుదీరి ఉన్నాడు మూషికవాహనుడు. జియ్యమ్మ దణ్ణం పెట్టుకుని, లెంపలు వేసుకుని గుడిసె ముందర చతికిలబడింది, కాళ్ళు ఒత్తుకుంటూ. ''ఓమే, సింతామణీ" అని పిలిచింది, తన ఉనికి తెలియజెయ్యడం కోసం.

"మే! ఇస్కూలుకు పోలా?" అని అడిగింది, వాకిట్లో గెంతుతున్న విజయశాంతిని.

''లీవు. కుడుముల పండగ్గదా.''

కంచంలో గంజిమెతుకులు తెచ్చి ముందర పెట్టింది కోడలు.

''పండగపూట కూడా గెంజిమెతుకులేనంట్రా పాపిష్టి దేవుడా!... ఒక కుడుములా - ఒక వడా - ఒక పాయసమా - ఏం పెరుక్కు తిందామని పుట్టినార్రా కూలిపోయిన బిడ్డారా...'' మెతుకులు మాడిపోయేటంత వేడిగా ఉంది ముసలావిడ నిట్టూర్పు.

వినాయకుడు అప్పటికే ఎన్.సి.సి బట్టలు ఇస్త్రీ చేయించి తెచ్చుకున్నాడు. వాడి తివ్వలు వాడివి. వాడి సర్దుబాట్లు వాడివి. టోపీకి పెట్టుకునే ఇత్తడి బిళ్ళలకూ, బెల్టుకు తగిలించుకునే ఇత్తడి కొక్కేలకూ సాయంత్రందాకా మెరుగు పెట్టాడు. అద్దాలకు మల్లే తళుకులీనేటట్లు తోలుబూట్లు పాలిష్ చేసుకున్నాడు. ప్రయాణంలో తొడుక్కోవడం కోసం ఒక జత యూనిఫారం మాత్రం పక్కన పెట్టి, మిగిలిన బట్టలు, కాన్వాస్ బూట్లు, కంబళి, స్వెట్టరు, రెయిన్‌కోటు, బ్లాంకెట్ వగైరాలన్నీ కిట్‌లో కూరి బిగించి కట్టేసరికి పొద్దు పోయింది. ఇంకేం పనిలేదు. ప్రయాణానికి అంతా సిద్ధం. తెల్లవారగానే యూనిఫారం తొడుక్కోవడం, కిట్ భుజాన వేసుకుని ఛలోమనడమే ఇక తరువాయి.

తండ్రి కోసం వేయికళ్ళతో ఎదురుచూస్తున్న కొడుక్కి చవితి చంద్రుడు గుంకుతున్నప్పుడు దర్శనమిచ్చాడు మొగిలయ్య. పడుతూ లేస్తూ, తూలుతూ పేలుతూ వొచ్చాడు ఇంటికి. ''శివశివమూర్తివి గణనాథా, నీకు సేతులెత్తి మొక్కుతాను గణనాథా'' అంటూ జోడించిన చేతులు పైకెత్తి, వేపచెట్టు కింద కొలువైన వినాయకుడి ముందు సాష్టాంగంగా సాగిలబడ్డాడు. ఎవరూ తపోభంగం చేయకుండా ఉంటే, అతడలాగే ఒళ్ళు మరచి నిద్రపోయేవాడో ఏమో? అయితే, వినాయకుడు ఊరుకోలేదు. ''అయ్యా! అయ్యా!'' అంటూ పిలిచాడు. పలక్కపోతే రెండు భుజాలు పట్టుకుని కుదిపాడు.

''ఎవుడ్రా వాడు?'' అంటూ లేచి కూచున్నాడు మొగిలయ్య. ''ఏందిరా నీ నస?''

''తెస్తివా అయ్యా?''

''రేపు చూసుకుందాంలే . పోరా!''

''యోవ్, తెల్లారగానే పోవాలయ్యా క్యాంపుకు నేను. నూర్రూపాయలియ్యి'' అంటూ భుజం పట్టి ఊపాడు వినాయకుడు. ''సరిగ్గా నూరే గావాల్నా?''

''యాభైరూపాయలన్నా ఉంటే, ఎట్టనో సరిపెట్టుకుంటా''

''ఒక్క రూపాయి గూడా నా దగ్గిర లేదుగానీ, ఒక పన్జెయ్.''

"నేనెట్ట పొయ్యేదిరా క్యాంపుకింక?'' అంటూ ఏడుపందుకున్నాడు వినాయకుడు.

"పోవద్దని ఎవరన్నార్రా? పోనూ రానూ టికెట్టు వాళ్ళే కొంటారుగదా? ఆ పది దినాలూ ముప్పొ టలా తిండి వాళ్ళే పెడ్తారు గదా? ఇంకేముంది ఖర్చు? చేతిఖర్చులకు నూర్లూ యాభైలా? ఎవరన్నా నీ సావాసకాపుల దగ్గర ఐదో పదో అడిగి తీసుకోపో."

ఆలాపన తరవాత "తాగుబోతు నాకొడకా" అందుకున్నాడు కొడుకు.

కాష్ఠంలో పీనుగులా చివాల్న పైకి లేచాడు మొగిలయ్య. "ఏమంటివిరా? తాగుబోతునీ కొడుకా నేను? కన్న తండ్రి అనే గౌరవం లేకుండా—" అంటూ మహోగ్రంగా వాడి మీదికి దూకాడు. వాడు అందలేదు. "నువ్వు కేంపు కెట్టపోతావో చూస్తానుండు, రౌడీ నాకొడకా" అంటూ ఇంట్లోకి దూరాడు మొగిలి. "ఏడనే వాడి గుడ్డా గునుర్లూ? ఇదేంది? వాడిదేనా ఈ మూట?" అంటూ కిట్ బయటికి మోసుకొచ్చాడు. సూరాటెంకాయ కొట్టినట్టు దాన్ని నేలకేసి దప్పున విసిరికొట్టాడు. ''తుక్కుతుక్కు చేసేస్తా చూసుకో నీ సామానంతా'' అంటూ మళ్ళీ దాన్ని అందుకోబోయాడు.

ఆ లోపలే మెరుపుల్లా, దాన్నెత్తుకుని దూరంగా జరిగాడు వినాయకుడు.


"బుద్ధిలేన్నాకొడకా! అంటూ చరణాలు అందుకున్నాడు.

''రేయ్! నిన్ను కైమాజేసి పిళ్ళారికి నైవేద్యం పెట్టకపోతే నేను తగీరు పొట్టబ్బ కొడుకునేకాదు'' అంటూ వాడి వెంటపడ్డాడు మొగిలి. అబ్బా కొడుకూ ఇద్దరూ అరగంటసేపు ఊళ్ళో అడ్డదిడ్డంగా దాగుడుమూతలాడారు. ఇక ఓపిక లేక, ఇంట్లోకి పోయి పడుకున్నాడు మొగిలయ్య.

కిట్ కింద పెట్టి, మాతమ్మ గుడి దగ్గర ఏడుస్తూ కూర్చున్నాడు వినాయకుడు.

జియ్యమ్మ లేచి వాడి దగ్గిరకెళ్ళింది. భుజం మీద చెయ్యి వేసి, "ఏడవబాకరా సామీ. ఊరుకో" అంటూ కొంగుతో వాడి కన్నీళ్ళు తుడిచింది.

> వినాయకుడు ఇచ్చిన ముద్దుల్ని నెమరేసుకుంటూ కూర్చుండిపోయింది జియ్యమ్మ.



''నేను కేంపుకెట్ట పోయేదే" అంటూ విదిలించుకున్నాడు వినాయకుడు.

''నువ్వు పోదువులేరా నాయనా.''

''బుద్ధుందా నీకు. యాభై రూపాయలన్నా లేకుండా ఎట్ట పోయేది?''

''నేనిస్తానుగదా యాభై రూపాయలు.''

వాడి కళ్ళు తళుక్కున మెరిశాయి. వాణ్ణి వెంటనే నమ్మించడానికి వీధి దీపం కింద నిలబడి కొంగుముడి విప్పింది ఆమె. అందులో ఉన్న డబ్బు వాడి చేతబెట్టి "ఎంతుందో లెక్కబెట్టు" అంది. వాడు లెక్కబెట్టి "యాభైరెండు" అన్నాడు.

"ఆ రెండూ నాకిచ్చేసి, యాభై నువ్వు తీసుకో. నడిజామైపోయింది. పండు కుందాం పదా."

తెలతెలవారుతూండగా ''అవ్వా. అవ్వా'' అంటూ తట్టి లేపాడు వినాయకుడు. లేచి కూచుంది జియ్యమ్మ. యూనిఫారం తొడుక్కున్న మనవడు రైల్వేస్టేషన్‌కు బయలుదేరబోతున్నాడు. వాడు ఆమెను కావలించుకుని డొక్కు దవడలు రెండూ ముద్దెట్టుకుని "పోయొస్తానవ్వా" అనేసి కిట్ భుజానికెత్తుకుని వెళ్ళిపోయాడు.

వాడిచ్చిన ముద్దుల్ని నెమరేసుకుంటూ అలాగే కూచుండిపోయింది జియ్యమ్మ. జియ్యమ్మలాంటి అవ్వ ఒకతి తనకూ ఉండరాదా అని లోలోపలే ఉవ్విళ్ళూరు తున్నాడో ఏమో గుడిసెకు ఎదురుగా పందిట్లో ఆకుల గద్దెపై అధివసించిన వినాయకుడు ఆమెను కళ్ళార్పకుండా చూస్తున్నాడు. ■